
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు 5
శుక్రవారం 12 సెప్టెంబరు 2025



ఆత్మకూరు బస్టాండ్‌లో భారీగా చేరిన వర్షపు నీరు

భారీ వర్షాలు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- అత్యధికంగా కొలిమిగుండ్లలో 128.4 మి.మీ. వర్షపాతం
- అత్యల్పంగా జూపాడుబంగ్లాలో 0.8 మి.మీ. వర్షపాతం నమోదు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఓ భారీ చెట్టు నేలకూలింది. ఐదు గంటల వ్యవధిలో జిల్లాలో 892.6మి.మీ వర్షపాతం నమోదైంది. కొలిమిగుండ్ల మండలంలో అత్యధికంగా 128.4మి.మీ వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా జూపాడుబంగ్లా మండలంలో 0.8మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో మరో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30నుంచి 40 కిలోమీటర్ల మేర గాలులు వీచే అవకాశముందని వెల్లడించారు. ఉరుములు, మెరుపుల సమయంలో ప్రజలు సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని, చెట్ల కింద నిలబడకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వర్షం వార్తలు 6లో



నంద్యాల ఎస్‌బీఐ కాలనీలో భారీ వర్షానికి విరిగిపడిన చెట్టు



రాజోలి ఆనకట్ట వద్ద పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

ప్రమాదకర స్థాయిలో రాజోలి ఆనకట్ట

చాగలమర్రి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలోని రాజోలి ఆనకట్ట ప్రమాదకర స్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆనకట్ట వద్ద కుందూ 15 వేల క్యూసెక్కుల ప్రవాహంతో పొంగి ప్రవహించింది. ఆయా గ్రామాల ప్రజలు నది దాటే ప్రయత్నం చేయరాదని అధికారులు సూచించారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కుందూ నదితో పాటు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మద్దూరు, బ్రాహ్మణపల్లె గ్రామాల సమీపంలో మినుము, పత్తి, జూట్ పంట పొలాలు నీట మునిగాయి. చాగలమర్రి గ్రామ సమీపంలో రైతులు సాగు చేసిన వరి పంట నీట మునిగింది.



బ్రాహ్మణపల్లె వద్ద నీట మునిగిన పత్తి పంట

2014-18 మధ్య కాలంలో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొనసాగింది. అప్పట్లో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా 1,173 పనులు చేపట్టారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పనులు చేసిన కాంట్రాక్టర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. కాంట్రాక్టర్లకు సంబంధించిన బిల్లుల్లో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు మదనపడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. పెండింగ్ బిల్లులు రూ.3.84 కోట్లు ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదికలు అందాయి. తక్షణమే చర్యలు చేపట్టారు. రూ.2.50 కోట్ల బిల్లులు మంజూరు చేశారు. అవి నేరుగా కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ అవుతున్నాయి.

జిల్లా పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం



బిల్లులొచ్చాయ్..!

- రూ. 2.50 కోట్లు మంజూరు
- కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ
- వైసీపీ కక్ష సాధింపు చర్యలు
- అండగా కూటమి ప్రభుత్వం
- ఆనందంలో బాధిత కాంట్రాక్టర్లు

నంద్యాల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని పెండింగ్ బిల్లులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. 2014-18 సంవత్సరంలో చేసిన పనులకు సంబంధించి వైసీపీ సర్కార్ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. దీంతో ఆయా కాంట్రాక్టర్లు బిల్లుల కోసం కార్యాలయాలు చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారినట్లైంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. వైసీపీ సర్కార్ కక్ష సాధింపునకు దిగినట్లైంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సదరు బిల్లులపై సానుకూలంగా స్పందించింది. 2014-18 మధ్య జరిగిన పనుల పరంగా పెండింగ్ బిల్లుల నివేదికపై ఆరా తీసింది. దీంతో ఆశాఖ అధికారుల సైతం ఆఘమేఘాలపై స్పందించింది. జిల్లా వ్యాప్తంగా 1,173 పనులకు సంబంధించి రూ.3.84కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. దీంతో ప్రభుత్వం సైతం తాజాగా పై పనులకు సంబంధించి రూ.2.50 కోట్ల బిల్లులను మంజూరు చేసింది. దీంతో ఆయా కాంట్రాక్టర్లలో ఆనందం వెల్లివిరిసింది.

జిల్లాలో పరిస్థితి ఇలా...

- జిల్లా వ్యాప్తంగా 2014-18లో జరిగిన పనులు : 1,173
- పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు : రూ.3.84 కోట్లు.
- తాజాగా మంజూరైన బిల్లులు : రూ.2.50 కోట్లు
- ఇంకా రావాల్సిన బిల్లులు : రూ. 1.34 కోట్లు

రెండు రోజులుగా ఆయా కాంట్రాక్టర్ల..

2014-18 పెండింగ్ బిల్లుల పరంగా... తాజాగా ప్రభుత్వం రూ. 2. 50 కోట్లను మంజూరు చేసింది. రెండు రోజులుగా ఆయా కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి నేరుగా బిల్లులు జమ అవుతున్నాయి. కాంట్రాక్టర్లలో ఆనందోత్సవం మొదలైంది. ఎన్నో ఏళ్ల తరువాత బిల్లులు మంజూరు కావడంతో బాధిత కాంట్రాక్టర్లు సైతం హర్షం వ్యక్తంచేస్తున్నారు. మిగిలిన పెండింగ్ బిల్లులు రూ.1.34 కోట్లు కూడా అతి త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిసింది.

ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా..

జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో నంద్యాల, ఆత్మకూరు, డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ, పాణ్యం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో 2014-18లో 1,173 పనులు చేశారు. ఇందుకు సంబంధించి రూ. 3.84 కోట్ల నిధులు పెండింగ్ ఉండగా 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్ల పాలనలో ఆ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఆయా కాంట్రాక్టర్లకు చెల్లించకుండా కక్ష సాధింపునకు దిగింది. ఇది గమనించిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సైతం యువగళం పాదయాత్రలో పై పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలోనే ఇచ్చిన మాట ప్రకారం.. ప్రభుత్వం తాజాగా రూ.2.50 కోట్లను విడుదల చేసింది.



కాంట్రాక్టర్లకు ఊరట

2014-18లో చేసిన పనుల పరంగా.. ప్రభుత్వం తాజాగా రూ.2.50 కోట్ల బిల్లులను విడుదల చేసింది. నేరుగా ఆయా కాంట్రాక్టర్ల ఖాతాలకు జమ అవుతోంది. మిగిలిన పెండింగ్ బిల్లులు కూడా త్వరలోనే వస్తాయి. ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్ ఉండటంతో ఆయా కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడ్డారు. తాజాగా బిల్లులు రావడంతో వారికి ఊరట కలిగినట్లైంది.

- నాగరాజు, ఈఈ(డీపీఆర్‌ఈవో), జిల్లా పంచాయతీరాజ్ శాఖ, నంద్యాల

ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డీడీగా విఘ్నేశ్ అప్పావ్



ఆత్మకూరు/నంద్యాల ఎడ్యుకేషన్ సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్‌గా విఘ్నేశ్ అప్పావ్‌ను నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వి.సాయిబాబాను తిరుపతి జిల్లా అటవీ అధికారిగా బదిలీ చేశారు. దీంతో ఆయన స్థానంలో అనంతపురం జిల్లా అటవీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న విఘ్నేశ్ అప్పావ్ నియమితులయ్యారు. ఆయన గతంలో మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన సందర్భంలో కొద్దిరోజుల పాటు ఆత్మకూరు ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. నంద్యాల కేంద్రంగా నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తిని బదిలీ చేసి ఆయన స్థానంలో రాజమహేంద్రవరం స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న విజయకుమార్‌ను ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్‌గా నియమించారు. ఆయన కూడా గతంలో ఆత్మకూరు డీఎఫ్‌వోగా పనిచేశారు.

జనరల్ మెడిసిన్ పీజీ సీట్లు పెంపు

- తొమ్మిది సీట్లను పెంచిన ఎన్ఎంసీ
- కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో జనరల్ మెడిసిన్‌లో పీజీ సీట్లు పెరిగాయని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మెడిసిన్ విభాగంలో ప్రస్తుతం 20 పీజీ సీట్లు ఉండగా నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) అదనంగా మరో 9 పీజీ సీట్లును పెంచిందన్నారు. మెడిసిన్‌లో పెరిగిన పీజీ సీట్లు ఈ విద్యా సంవత్సరం నుంచి అమలులోకి వస్తాయని అన్నారు. ఈ సీట్లు పెంపు కోసం కర్నూలు జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డా.శ్రీరాములును ప్రత్యేకంగా ఢిల్లీకి పంపి ప్రక్రియను విజయవంతంగా నిర్వహించి పీజీ సీట్లు పెంపు దలకు కృషి చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ, స్టేట్ క్యాన్సర్ యూనిట్ విభాగాల్లో కూడా అదనపు పీజీ సీట్లు కోసం ప్రతిపాదనలు పంపామని, అవి కూడా వచ్చే అవకాశం ఉంద న్నారు. జనరల్ మెడిసిన్‌లో పెరిగిన సీట్లతో రోగులకు మెరుగైన సేవలు అందుతాయన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు.

కన్నకొడుకును చంపేశాడు..!

పసిబిడ్డను నీటి డ్రమ్ములో ముంచి హత్య.. ఆపై భార్యపై దాడి

వివరాలు 7లో



మహానందిలో ప్లాస్టిక్ నివారణపై ప్రచారం నిర్వహిస్తున్న శివ తిప్పత్రి

ప్లాస్టిక్ ఫైటర్

ప్లాస్టిక్‌పై సమరానికి సిద్ధమయ్యాడు. ప్లాస్టిక్‌ను నివా రణే లక్ష్యంగా పెట్టుకున్నాడు చిరుద్యోగి శివ తిప్పత్రి. గురువారం మహానంది ఆలయం ముందు ప్లాస్టిక్ నివారణే లక్ష్యం అంటూ తన ఒంటిపై దుస్తులు ధరించి ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం భద్రాది కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు వాసి శివ. అదే గ్రామంలోని జడ్పీ పాఠశాలల్లో రికార్డు అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్నారు. పదేళ్ల నుంచి ప్లాస్టిక్‌ను వినియోగించడం లేదు. ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈఏడాది జూలై 3న ప్లాస్టిక్ నివారణను పురస్కరిం చుకొని తన స్వగ్రామం నుంచి 'ప్లాస్టిక్ నివారణ మహా యజ్ఞం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా లక్ష కరపత్రాలను పంపిణీ చేయాలని భావించినట్లు చెప్పారు. ఈనేపథ్యంలోనే మహానందికి వచ్చామని, ఇప్పటివరకు 15 వేల కరపత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.

- మహానంది, ఆంధ్రజ్యోతి

విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజలకు భద్రత : ఎస్పీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు భద్రత, భరోసా కల్పించేందుకే విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేయడంతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచించారు. తల్లి దండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

- యూరియా విషయంలో వైసీపీ నీచ రాజకీయం
- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజం



బనగానపల్లె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని, అయితే యూరియా విషయంలో వైసీపీ నీచ రాజకీయం చేస్తోందని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూరియా కేటాయింపులు, సరఫరాను సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 1.04 మెట్రిక్ టన్నులు వినియోగం యూరియా వినియోగం అయిందన్నారు. ధర తక్కువ కావడం, సాగు శాతం పెరగడంతో యూరియాకు డిమాండ్ ఏర్పడిందన్నారు. వచ్చే రబీ సీజన్‌లో దృష్టి పెట్టుకొని యూరియా సరఫరాకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళికలు చేపట్టినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో తాడేపల్లి దాటిరాని మాజీ సీఎం జగన్ నేడు రైతుల కష్టాలు అంటూ సరికొత్త డ్రామాకు తెరతీస్తున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉండగా కనీసం జగన్ రైతులకు సాగునీరందించే పంట కాలువల్లో పూడికలు తీయలేదని గుర్తుచేశారు. ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో 6.91 లక్షల మెట్రిక్ టన్నులు యూరియాను కేటాయించిందని, ఇప్పటి వరకు రైతులు 6.11 లోల మెట్రిక్ టన్నులు వినియోగించారని చెప్పారు. డీఏపీ వంటి ఇతర ఎరువుల కూడా గత ఏడాది కంటే 20శాతం అధికంగా కొనుగోలు చేశారన్నారు. మరో పది రోజుల్లో మరో 30 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వస్తుందని చెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో రాయలసీమ జిలాల్లో తదితర ప్రాంతాల్లో 1.6లక్షల ఎకరాలు అదనంగా సాగు అయిందని చెప్పారు. పొగాకు రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం రూ.200 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. నేపాల్ సంక్షోభం నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ తెలుగువారికి బాసటగా నిలిచి వారిని క్షేమంగా రాష్ట్రానికి తీసుకువచ్చారన్నారు. ఇది అందరికీ గర్వకారణమన్నారు.

ఎడతెరిపిలేని వాన

- ఉల్లి రైతుల్లో వణుకు
- 15 మండలాల్లో భారీ వర్షం
- గూడూరులో అత్యధికంగా 99 మి.మీ. వర్షపాతం



పెంచికలపాడు దగ్గర వక్కిలేరు వాగు పొంగిపొర్లడంతో బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీరు

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): ఉల్లి రైతుల్లో మళ్లీ వణుకు మొదలైంది. ఒక వారం రోజులు వర్షం తెరిపించి ఎండలు రావడంతో రైతులు ఆనందపడ్డారు. ఉల్లిని ఆరబెట్టుకుని మార్కెట్‌యార్డుకు తీసుకెళ్లి మంచి ధర అందుకుందామని ఆశించిన రైతులకు గురువారం కురిసిన వర్షం వారిలో మళ్లీ ఆవేదనను నింపింది. జిల్లాలో గురు వారం 23 మండలాల్లో వర్షాలు పడ్డాయి. గూడూ రులో 99 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదు కాగా మద్దికెరలో 97.8, చిప్పగిరిలో 68.4, హాల హర్విలో 62.2, మంత్రాలయంలో 51.6, తుగ్గలిలో 45.4, ఆలూరులో 38.2, పత్తికొండలో 35.2, కల్లూ రులో 30.8, ఆదోనిలో 28.2, నందవరంలో 27.4, సి.బెళగల్‌లో 25, వెల్దుర్తిలో 22.6, ఆస్పరిలో 22.4, ఓర్వకల్లులో 22, కర్నూలు అర్బన్‌లో 19.6, కర్నూలు రూరల్‌లో 18.2, హొళగుందలో 16.4, మిగిలిన మండలాల్లో 2.6 నుంచి 9.6 మి.మీ., వరకు వర్షం కురిసింది. ఈ వర్షాల వల్ల జిల్లాలో చేతికందే సమ యంలో ఉన్న ఉల్లి పంట మొత్తం నీటి పాలైంది. ఉల్లిగడ్డలను కోసి కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకెళ్లాలని వివిధ గ్రామాల రైతులు సిద్ధం అవుతున్న తరుణంలో ఇలా వర్షం పడటంతో రైతు లు ఆందోళనకు గురవుతున్నారు. ఉల్లిని కాపాడుకు నేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు.

పరవళ్లు తొక్కిన కుందూ



ఓర్వకల్లులో పొంగి పొర్లుతున్న కుందూ వాగు

ఓర్వకల్లు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున వర్షం దంచి కొట్టడంతో వాగులు, వంకలు చెక్‌డ్యాంలు వర్షం నీటితో కళకళలాడాయి. ఓర్వకల్లులోని కుందూ వాగు పొంగి పొర్లింది. గ్రామం నుంచి జీవేశ్వరస్వామి గుడి సమీపాన ఉన్న కాలనీకి వాగు ఉధృత ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉప్పలపాడు, లొద్దిపల్లె గ్రామాల్లో వర్షం నీరుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

- గూడూరులో ఉధృతంగా వక్కిలేరు వాగు
- వక్కెర వాగులో చిక్కుకొన్న ఆర్టీసీ బస్సు



పెంచికలపాడు దగ్గర బ్రిడ్జిపైకి చేరిన వరద ప్రవాహంతో ప్రైవేట్ వాహనంలో వెళ్తున్న విద్యార్థులు

గూడూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గూడూరులో గురువారం తెల్లవారుజామున నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వంకలు వాగులు పొంగిపొర్లాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వక్కెర వాగు పొంగి పొర్లడంతో పెంచికలపాడు దగ్గర బ్రిడ్జిపై వరద పోటెత్తింది. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిమ్మగురుడు స్వామి ఆలయం సమీపంలో వంక పొంగి పొర్లడంతో సింగనగేరిలోని ఇళ్ళు, గుడిసెల్లో నీరు చేరడంతో జనం ఇబ్బందులు పడ్డారు. అలాగే ఎస్సీ కాలనీ, తూర్పు, పడమర బీసీ కాలనీల్లో లోతట్టు ప్రాంతాలు జలమ యం కాగా ఇళ్లలోకి నీరు చేరకుండా ఇసుక బస్తాలను అడ్డంగా ఉంచారు. కాలనీల్లో మొకాటి లోతు వర్షం నీరు చేరడంతో కాలువల్లో చేరిన చెత్తను ప్రొక్లెయినర్లతో తొలగించారు. గూడూరు నుంచి కర్నూలుకు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు పెంచికలపాడు వద్ద వక్కెర వాగులో వరద ప్రవాహానికి చిక్కుకొంది. దీంతో ఎమ్మిగనూరు నుంచి గూడూరు మీదుగా కర్నూలుకు వెళ్లే ఆర్టీసీ బస్సులు పెంచికలపాడు బ్రిడ్జి దగ్గర నిలిచిపోయాయి. మరికొన్ని వాహనాలు ప్యాలకుర్తి మీదుగా కర్నూలుకు వెళ్లాయి.



గూడూరులో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతంలో ఇళ్లల్లో చేరిన వర్షపు నీరు



గూడూరులో కాలనీల్లో ప్రవహిస్తున్న వర్షం నీరు



వక్కిలేరు వాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

దెబ్బతిన్న టమోట

- కలచట్లలో కూలిన ఇల్లు



ప్యాపిలి: కలచట్లలో వర్షానికి కూలిన ఇల్లు

ప్యాపిలి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో టమోటా పంటలు దెబ్బతిన్నాయి. ప్యాపిలితో పాటు కలచట్ల, ఎర్రగుంట్లపల్లి, వెంగళాంపల్లి, ఏనుగమర్రి, ఎస్.రంగాపురం, నల్లబల్లి గ్రామాల్లో రైతులు వేరుశనగ, సజ్జ, కంది పాటు టమోట పంటను అధికంగా రైతులు సాగు చేశారు. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేశారు. అయితే భారీ వర్షానికి పొలాలల్లో వర్షపు నీరు నిలిచింది. ప్రస్తుతం కోత దశలో ఉన్న టమోట పంట వర్షానికి దెబ్బతిన్నది. కాయలు రెండు రోజుల్లో కుళ్లిపోతాయని రైతులు ఆవేదనకు గురవుతున్నారు.

కలచట్లలో కూలిన ఇళ్లు : ప్యాపిలి మండలంలోని కలచట్ల గ్రామంలో చంద్రశేఖర్‌కు చెందిన మట్టిమిద్దె పైకప్పు వర్షానికి కూలిపోయింది. అయితే ప్రమాదాన్ని ముందుగానే గ్రహించిన కుటుంబం బంధువుల ఇంటికి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది.

ఆత్మకూరులో భారీ వర్షం

లోతట్టు కాలనీలు జలమయం

ఆత్మకూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆత్మకూరు ప్రాంతంలో బుధవారం వర్షం దంచికొట్టింది. తెల్లవారుజాము 3గంటల నుంచి ఉదయం 10గంటల వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో పట్టణంలోని పలు లోతట్టు కాలనీల్లోకి వరద వచ్చి చేరింది. ఆత్మకూరు పట్టణంలోని ఏకలవ్యనగర్, ఇందిరానగర్, సాయిబాబానగర్, లక్ష్మీనగర్, గరీబ్‌నగర్, హుసేన్‌సానగర్, రహమత్‌నగర్ తదితర ఏరియాల్లోని లోతట్టు కాలనీల్లో నీరు చేరడంతో జనం అసౌకర్యానికి గురయ్యారు. కప్పలకుంట, అప్పారావువీధి, పోస్టాఫీసు ఏరియా, కేజీరోడ్డు తదితర ప్రధాన రహదారుల్లో వర్షపునీరు నిలిచింది. ఆత్మకూరు ఆర్టీసీ డిపో, మార్కెట్‌యార్డు ప్రాంగణాల్లోకి భారీగా వర్షపునీరు చేరింది. ఆత్మకూరు పట్టణం మీదుగా ప్రవహించే గుండ్లకమ్మ వాగుతో సహా శివారులో భవనాశి, పడేవాగులు ఉధృతంగా ప్రవహించాయి. అలాగే పలు గ్రామాల్లోని పంటపొలాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని అన్ని చెరువుల్లో నీటినిల్వలు గరిష్టస్థాయికి చేరుకున్నాయి. కాగా నంద్యాల రహదారి సమీపంలో జరుగుతున్న కేజీరోడ్డు బైపాస్ నిర్మాణం వల్ల పంటపొలాల్లో భారీగా వర్షపునీరు నిలిచిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పట్టణంలోని పలు లోతట్టు కాలనీలను సందర్శించి వర్షపునీటిని మళ్లించే చర్యలు చేపట్టారు.



ఆత్మకూరు మార్కెట్‌యార్డు ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు

కల్వటాలలో ఎర్రవాగు కన్నెర్ర

- పలు గ్రామాల్లో ఉప్పొంగి ప్రవహించిన వంకలు
- కొలిమిగుండ్లలో వీధులు జలమయం
- నెల్లూరు-ముంబై హైవేపై రాకపోకలకు అంతరాయం



కోరుమానుపల్లె వద్ద రాకపోకలను అడ్డగించిన వంక

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల మండలంలో వివిధ గ్రామాల్లో వానలు దంచి కొట్టాయి. బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వర్షం, గురువారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో నంద్యాల జిల్లాలోనే అత్యధికంగా 129మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

కల్వటాల వద్ద ఎర్రవాగు ఉధృతంగా ప్రవహించింది. కొండ ప్రాంతాల్లో నుండి వాగుకు పెద్ద ఎత్తున వరద నీరు పోటెత్తడంతో నెల్లూరు-ముంబై హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది. అటు జమ్మలమడుగు వైపు, ఇటు తాడిపత్రి వైపు సమారు ఆరు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఐ మద్దినేని రమేష్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాసులు కల్వటాల వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. మండలంలోని ఇటిక్యాల, అబ్దులాపురం, కోరుమానుపల్లె, మీర్జాపురం, కల్వటాల, తిమ్మనాయినిపేట తదితర గ్రామాల్లో ప్రధాన వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. సద్దలవెంగన్న చెరువు, తిమ్మనాయినిపేట చెరువు, దయ్యాలచెరువు, చిన్న చెరువు, హనుమంతుగుండం చెరువులు నిండు కుండల్లా మారడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. మరోవైపు కోరుమానుపల్లె, కొలిమిగుండ్ల, మీర్జాపురం, బెలుం తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంట పొలాల్లో పెద్ద ఎత్తున వరద నీరు చేరి, పంటలు నీటమునిగాయి. ఇంకోవైపు మండలకేంద్రమైన కొలిమిగుండ్లలోని శాంతినగర్‌లో పలు వీధులు భారీ వర్షం కారణంగా జలమయమయ్యాయి. 4వీధుల్లో సుమారు 3అడుగుల మేర వరద నీరు చేరడంతో ఇళ్ల ముందు పార్క్ చేసివున్న బైకులు మునిగి పాడైనట్లు స్థానికులు వాపోయారు. వర్షం ఆగిన అనంతరం సుమారు నాలుగు గంటల పాటు శాంతినగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పాణ్యంలో స్తంభించిన రాకపోకలు


పాణ్యం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాణ్యం మండలంలో ఉన్నఫళంగా కురిసిన వర్షానికి పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఉదయం విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోయారు. బలపనూరు పరిధిలోని వడ్డుగండ్ల, రసూల్‌పేట మధ్య గల కావేటి వాగుకు పెద్ద ఎత్తున నీరు చేరడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కొందరు ఖాళీ పాల క్యాన్లను ఆసరాగా చేసుకుని వాగును దాటారు. కానుగలవాగు, వద్దెల వాగు, జుర్రాగు వాగులకు పెద్ద ఎత్తున నీరు చేరి ప్రవహించాయి.



వడ్డుగండ్ల, రసూల్‌పేట మధ్య పొంగి ప్రవహిస్తున్న కావేటి వాగు

ఔరా అవుకు..!

- కనువిందు చేస్తున్న జలపాతం



అవుకు రిజర్వాయర్ వద్ద కనువిందు చేస్తున్న ఎత్తిపోతల జలపాతం

అవుకు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అవుకు మండలంలోని ఓ జలపాతం ప్రపంచ ఖ్యాతి గడించిన జోగ్ ఫాల్స్‌ను తలపిస్తోంది. మండలంలోని ఎర్రమల కొండల నుంచి వర్షపు నీరు సెలయేర్ల ద్వారా ప్రవహిస్తూ అవుకు రిజర్వాయర్ వద్ద కనువిందు చేస్తోంది. గురువారం అవుకు మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో ఎత్తయిన కొండలపై నుంచి జాలువారుతున్న అవుకులోని జలపాతాన్ని వీక్షించేందుకు యువత ఉత్సాహం చూపించారు. ఇదిలా ఉండగా అవుకు రిజర్వాయర్‌లో 3 టీఎంసీల నీరు ఉండగా ఎత్తిపోతల ద్వారా రిజర్వాయర్‌కు భారీగా నీరు వచ్చి చేరుతోంది. కునుకుంట్ల - ఉప్పలపాడు మధ్య వాగు పొంగిపొర్లటంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి.

ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్



మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దసరా కానుక గా ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కర్నూలులో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడేందుకు కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఉద్యోగులుగా తాము ఎల్లవేళలా సహకరిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ సురేష్ రెడ్డి, సిటీ సెక్రెటరీ చెన్నకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌కేర్ కోర్సులకు గడువు పొడిగింపు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ సర్వీసెస్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ(కేఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు పూరించిన దరఖాస్తులు (ఆఫీసు దినాల్లో) కేఎంసీ, కర్నూలులో రూ.100 రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.పోస్టు ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని వెల్లడించారు. కౌన్సెలింగ్ అక్టోబరు 10వ తేదీ కేఎంసీలో నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్ బైపీసీ చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తారని, ఆ తర్వాత మిగిలిన గ్రూపులకు ప్రాధాన్యత ఇవ్వబడునని వివరించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

పాణ్యం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ చాంపియన్‌షిప్ సబ్ జూనియర్స్ విభాగంలో జరిగే పోటీలలో పాణ్యం మోడల్ పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ దినేశ్‌బాబు తెలిపారు. గురు వారం ఆయన మాట్లాడుతూ ఈనెల 13, 14 తేదీలలో విశాఖ పట్నంలో జరిగే ఏపీ స్టేట్ టార్గెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో పాఠశాల విద్యార్థులు ఎనిమిది మంది బాలికలు, ఎని మిది మంది బాలురు పాల్గొం టున్నారన్నారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందిం చారు. కార్యక్రమంలో పీడీ కిర ణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

41కిలోల భారీ చేప చిక్కింది

ఆదోని డివిజన్ పరిధిలోని తుంగభద్రకు చెందిన జాలరు రుద్ర వలలో 41 కేజీల భారీ బొచ్చ (కట్ల) చేప చిక్కింది. రోజు మాదిరిగానే తుంగభద్ర నదిలోకి చేపలు పట్టడానికి వెళ్లగా వలలో గురువారం భారీ చేప చిక్కిందని రుద్ర తెలిపారు. ఇంతవరకు ఎప్పుడూ ఇంత పెద్ద చేప చిక్కలేదని, మొదటిసారిగా ఇంత పెద్ద చేపను పట్టుకున్నట్లు ఆనందం వ్యక్తం చేశాడు. ఈ చేపను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. ఈ కట్ల చేపను రూ.8 వేలకు విక్రయించినట్లు తెలిపారు.





వలకు చిక్కిన 41 కేజీల బొచ్చ (కట్ల) చేపను చూపిస్తున్న జాలరి రుద్ర

- ఆదోని, ఆంధ్రజ్యోతి

ఘనంగా జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం

డోన్ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట్ల గ్రామ సమీపంలో ప్రధాన రోడ్డులో ఉన్న నగరవనంలో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అటవీ అమరవీరులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అటవి శాఖ అధికారి నాగమునేశ్వరి హాజరయ్యారు. అటవీ అమరవీరులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని అధికారి నాగమునేశ్వరి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డోన్ ఫారెస్టు రేంజర్ ప్రవీణ్ కుమార్, ఉప అటవీ క్షేత్ర అధికారి రవీంద్ర నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



అమరవీరుల దినోత్సవంలో పాల్గొన్న అటవీశాఖ జిల్లా అధికారి నాగమునేశ్వరి

నేపాల్ నుంచి
స్వస్థలాలకు ప్రజలు

- వారిని తీసుకురావడానికి మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ
- కృతజ్ఞతలు తెలిపిన ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు


ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ చొరవతోనే నేపాల్‌లో చిక్కుకున్న వారు స్వస్థలాలకు చేరుకుంటున్నారని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురు వారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు ఎప్పుడు ఎక్కడ అపద వచ్చినా వారిని ఆదుకోవడంలో టీడీపీ ముందు ఉంటుందని తెలిపారు. నేపాల్ మారణహోమంలో చిక్కుకున్న తెలుగు ప్రజలను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చడంలో కీలక పాత్ర వహించిన మంత్రి నారా లోకేశ్ కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఓ ప్రకటన ద్వారా చెప్పారు. బాధితులతో స్వయంగా మాట్లాడి వారికి ధైర్యం చెప్పడం, లోకేశ్ కోఆర్డినేటర్లతో సహా మ్యాప్ సిద్ధం చేయించి ఢిల్లీలోని ఏపీ భవన్ ద్వారా అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయించడం, చిక్కుకున్న వారికి సురక్షితంగా తీసుకురావడం ఎంతో సాహసంతో కూడుకున్న పని అన్నారు. నేపా ల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలను సురక్షితంగా తీసుకు వచ్చేందుకు మంత్రి లోకేశ్ ప్రాధాన్యం ఇచ్చారని టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ప్రాధాన్యత అన్నారు. అయితే వైసీపీ నేత జగన్మోహన్ రెడ్డి కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు.

ఓర్వకల్లు: నేపాల్ పర్యటనకు వెళ్లి అక్కడ ఉద్రిక్తత పరిస్థితుల మధ్య చిక్కుకుపోయిన తెలుగువారు బాధితులకు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో స్వగ్రామాలకు తీసుకొచ్చారని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని ఏపీ భవన్‌లో నిత్యావసర హెల్త్‌లైన్ ఏర్పాటు చేయడం, చిక్కుకుపోయిన ప్రజలకు ఆహారం, నీరు వసతి సదుపాయాలు కల్పించేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా, కేవీ మధు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: నేపాల్‌లో చిక్కుకున్న వారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడానికి మంత్రి నారా లోకేశ్ కృషి చేశారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. గురువారం నగరంలోని మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌరు చరితారెడ్డి సమావేశం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో తెలుగు వారిని తీసుకొచ్చి వారి కుటుంబాల్లో సంతోషం నింపారన్నారు.

తెలుగు వారికి అండగా నిలవడంలో లోకేశ్ తీరు భేష్


నంద్యాల ఎంపీ శబరి

నంద్యాల రూరల్: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి ఎప్పుడు ఎక్కడ ప్రమాదం వచ్చిన ఆదుకోవడంలో మంత్రి లోకేశ్ తీరు భేష్ అని ఎంపీ బైరెడ్డి శబరి ప్రశంసించారు. గురువారం ఆమె మాట్లాడుతూ నేపాల్‌లో అల్లర్లలో చిక్కుకున్న తెలుగు ప్రజలను ఏపీకి సురక్షితంగా తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అనంతపురంలో జరిగిన సూపర్‌సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమాన్ని సైతం రద్దు చేసుకుని నేపాల్‌లో ఉన్నవారిని ఆదుకోవడంలోనే నిమగ్నమయ్యారన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పశువుల మార్కెట్ దగ్గర కూల్‌డ్రింక్స్ దుకాణంలో విద్యుదాఘా తంతో గోపీకృష్ణ(13) అనే బాలుడు మృతి చెందాడు. వివరాలివీ.. పట్టణంలోని గంజల్ల రోడ్డులో నివాసం ఉంటున్న వెంకటేశ్ గౌడ్‌కు ఇద్దరు కుమారులు. గోపీకృష్ణ పట్టణంలోని వీవర్స్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వీరికి పశువుల మార్కెట్ గేట్ దగ్గర కూల్ డ్రింక్స్ షాపు ఉంది. రోజు మాదిరిగానే గురువారం దుకాణాన్ని తెరిచాడు. ఈక్రమంలో సర్వీస్ వైరును అప్పటికే ఎలుకలు కొద్దిగా కొరకటంతో కాపర్ వైర్ దుకాణం రేకులకు తగిలి ఉంది. రేకుల పక్కనే ఫ్రిజ్ ఉంటంతో దాన్ని తెరిసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలి పడిపోయాడు. దీన్ని గమనించిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వటంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకొని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు.

గర్భిణి మృతి

- ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రసవం కోసం వచ్చిన ఓ గర్భిణి మృతి చెందింది. దీంతో ఆమె బంధువులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. చిన్న పెండెకల్ గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య లింగమ్మ(27) ప్రసవం కోసం బుధవారం పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. గురువారం సిజేరియన్ చేస్తామని వైద్యులు చెప్పారు. శస్త్రచికిత్స కోసం సిద్ధం చేసుకున్న సమయంలో సీరియస్‌గా ఉందని చెప్పి ఆదోనిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో గర్భిణి బంధువులు హుటాహుటిన ఆదోనికి తీసుకెళ్లారు. అయితే అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందిందని చెప్పారు. దీంతో మృతదేహంతో ఎమ్మిగనూరుకు వచ్చి ప్రైవేటు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. పట్టణ పోలీసులు ఆసుపత్రి దగ్గరకు చేరుకొని విచారించారు.

కన్నకొడుకును చంపేశాడు..!

పసిబిడ్డను నీటి డ్రమ్ములో ముంచి హత్య.. ఆపై భార్యపై దాడి ● దేవనకొండలో దారుణం

(ఆ బిడ్డకు మాటలు వచ్చి ఉంటే ఇలా అనేవాడేమో..)

ఎందుకు నాన్నా ఇలా చేశావు.. నా అల్లరి నీకు నచ్చలేదా? లేక నేనే నచ్చలేదా? నా పుట్టుకపై అనుమానమా? లేక అమ్మపై అనుమానమా?.. నువ్వు నన్ను ఎత్తుకుంటే ముద్దుగా ముద్దు పెట్టుకుంటావనుకున్నా, కానీ ఇలా నీటిలో ముంచి చంపేస్తావనుకోలేదు నాన్నా, ఎంత పనిచేశావు డాడీ. నన్ను చంపే సమయంలో అమ్మ పేగు బంధం.. నీ ప్రాణబంధం గుర్తుకు రాలేదా? చివరగా ఒక్క మాట.. నేను నీ కొడుకునే నాన్న


ఉయ్యాలలో అచేతనంగా చిన్నారి సాగర్...


నిందితుడు, తండ్రి నరేష్

దేవనకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో ఓ భర్త కర్కశంగా వ్యవహరించాడు. ఎనిమిది నెలల కుమారుడిని హతమార్చి, భార్యపై విచక్షణా రహితంగా గాయపడిచారిచిన సంఘటన దేవనకొండ సమీపంలో చోటుచేసుకుంది. దేవనకొండకి చెందిన చాకలి నరేష్ మొదటి భార్య మూడేళ్ల క్రితమే మృతిచెంది, ఆమెకు ఇద్దరు కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అనంతరం గోనెగండ్ల మండలం, కులుమాల గ్రామానికి చెందిన నర్సప్ప, సుజాత కుతూరు శ్రావణితో రెండేళ్ల క్రితం (రెండో) వివాహం జరిగింది. కాగా నెల నుంచి కుటుంబంలో అత్తమామ, మొదటి భార్య పిల్లలకు కలహాలు మొదలైన్నాయి. వీరు ఇంట్లో ఉండకూడదని ఘర్షణ చోటుచేసుకోవడంతో 20 రోజులు క్రితం నరేష్ రెండో భార్యను తీసుకుని దేవనకొండకి రెండు కిలోమీటర్ల దూరంలోని తమ ఎర్రచందనం పొలంలో ఉన్న గదిలోనే కాపురం సాగిస్తున్నారు. కాగా భార్యపై అనుమానం పెంచుకున్న నరేష్ గురువారం ఉదయం భార్యపై అనుమానంతో విచక్షణారహితంగా దాడిచేసి, తన 8 నెలల కుమారుడు సాగర్‌ను నీటి డ్రమ్ములో ముంచి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న సీఐ వంశీనాథ్ ఘటన స్థలానికి చేరుకొని, తీవ్రంగా గాయపడ్డ శ్రావణిని అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. శ్రావణి కుటుంబ సభ్యులు బాలుడు సాగర్ మృత దేహంతో న్యాయం చేయాలని దాదాపు మూడు గంటలపాటు పత్తికొండ, దేవనకొండ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయ్యాయి. సీఐ జోక్యం చేసుకుని విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రావణి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


భర్త దాడిలో గాయపడ్డ శ్రావణి

మట్టితో అడ్డుకట్ట


ఎక్సవేటర్ ద్వారా మట్టి వేసి గండి పూడ్చివేత

మద్దికెర మండలంలోని ఎడవలి గ్రామ శివారులో హంద్రీనీవా కాలువ నిండుకుండలా ప్రవహిస్తోంది. నీరు గట్టుపైకి వస్తుండటంతో గండి పడుతుందోనన్న అనుమానంతో రైతులు, ప్రజలు స్పందించారు. గురువారం ఉదయం నుంచే ఎక్స్‌కవేటర్ ద్వారా మట్టితో అడ్డుకట్ట వేశారు. హంద్రీనీవా కాలువ కింద వేల ఎకరాలు ఉండటమే కాకుండా బొమ్మనపల్లి గ్రామం కూడా ఉంది. హంద్రీనీవా కాలువకు ప్రమాదం పొంచి ఉందని, కాలువగట్టుపైన నీరు పారుతుందని అధికారులకు సమాచారమిస్తే నిర్లక్ష్యం చేశారని, గ్రామానికి చెందిన నంది జయరాముడు, ఓబులేసు ఆరోపించారు.

● మద్దికెర, ఆంధ్రజ్యోతి

ఉల్లి పంటను కాపాడుకోవాలి

- ఉద్యానశాఖ జిల్లా అధికారి రామాంజనేయులు



కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో ఉల్లి పంటకు అధిక వర్షాల ముప్పు పొంచి ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండి పంటను కాపాడుకోవాలని ఉద్యానశాఖ జిల్లా అధికారి రామాంజనేయులు రైతులకు సూచించారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉల్లి పంటలో నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటకు పంపాలని, ఉల్లినారును ఎత్తయిన నారుమళ్లలో వేసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు, తుఫాన్ సమయంలో కొట్టుకుపోయిన నారుమళ్లను తిరిగి ఎత్తయిన నారుమళ్లలో నాటుకోవాలన్నారు. నారుమళ్లకు 3 గ్రాముల కాపర్ యాక్సి క్లోరైడ్ గానీ, అలైట్ ఒక గ్రాము మందును లీటరు నీటికి కలిపి తడిపితే కుల్లు తెగుళ్ల ఆశించదని తెలిపారు. రెండు, మూడుసార్లు 0.5శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో పంటపై పిచికారీ చేయాలన్నారు. సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేస్తే మొక్కలు త్వరగా కోలుకుంటాయన్నారు. ప్రధాన పొలంలో పంట వయస్సు 45 రోజుల్లోపు ఉన్నట్లయితే వర్షం ఆగిన తర్వాత లైటుగా పోయింగ్ చేసి పైపాటిగా ఎకరాకు 60 కిలోల యూరియాను 20 కిలోల న్యూరేట్ ఆఫ్ పోటాష్ ఎరువులను కలిపి చల్లాలన్నారు. ఆకులు కత్తిరించు పురుగుల నివారణకు 5 శాతం వేపగింజల కషాయాన్ని లాండా సైహాలోత్రిన్ 1.5 మి.లీ.ను ఒక లీటరుకు కలిపి పిచికారీ చేయాలన్నారు. శనగపచ్చ పురుగు నివారణకు హెచ్ఎన్‌పీవీ ద్రావణాన్ని పిచికారీ చేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సూచించారు.

ముగ్గురి అరెస్టు

డోన్ టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ వ్యాపారిని బలవంతంగా అడ్డుకుని, బెదిరించి జులుం ప్రదర్శించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు. గురువారం నిందితులను అరెస్టు చేసి సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, ఏఎస్ఐ బాస్కర్‌లు విలేకరులకు సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. డోన్ పట్టణానికి చెందిన గొల్ల రఘు అలియాస్ జామకాయల రవి, చిగురుమానుపేటకు చెందిన గుండెపోగు అబ్బాస్, పాతపేటకు చెందిన ఉప్పరి సురేంద్ర పట్టణంలో పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం చేస్తున్న సయ్యద్ నూర్ బాషాను బలవంతంగా అడ్డుకుని, జులుం ప్రదర్శించారు. నూర్ బాషాకు చెందిన వెయింగ్ మిషన్లను తీసుకెళ్లడమే కాకుండా తమ అనుమతి లేకుండా వ్యాపారం చేయవద్దని హుకుం చేశారు. నూర్ బాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం వారిని అరెస్టు చేశారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

జనసేన కార్యకర్త కుటుంబానికి సాయం

సంజామల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కానాల గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త దానియేలు కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. దానియేలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు జనసేన సభ్యత్వం ఉండడంతో ప్రమాద బీమా వర్తించింది. దీంతో ప్రమాద బీమా అధికారులు జనసేన నాయకుడు పీవోసీ పత్తి సురేశ్‌బాబు చేతుల మీదుగా గురువారం దానియేలు భార్యకు రూ.5 లక్షల చెక్కును అందించారు. కోఆర్డినేటర్ వేణు, వలంటీర్ మహబూబ్, జనసేన పార్టీ నాయకులు భాస్కర్, ఇమామ్, షేక్షావలి, రాజు, కులాయప్ప, గుర్రప్ప పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

పగిడ్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రాతకోట గ్రామానికి చెందిన పులికంటి మద్దిలేటి అనే వ్యక్తి అక్రమంగా మద్యం సీసాలు విక్రయిస్తుండటంతో గురువారం పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం మాట్లాడుతూ మద్దిలేటి సంతమార్కెట్ సమీపంలో మద్యం విక్రయిస్తుండగా ముచ్చుమర్రి ఏఎస్ఐ శేషయ్య ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారన్నారు. మద్దిలేటి నుంచి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

శ్రీశైలం: శ్రీశైలంలో స్థానిక ఒకటవ పట్టణ పోలీసులు గతంలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను గురువారం ధ్వంసం చేశారు. శ్రీశైలం ఒకటవ పట్టణ సీఐ జి.ప్రసాదరావు మాట్లాడుతూ పట్టుబడిన వాటిలో సారా, ఏపీ, తెలంగాణ మద్యం ఉందన్నారు.


స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

మతిభ్రమించి మాట్లాడుతున్న జగన్

- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజం



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ మతిభ్రమించి మాట్లాడుతు న్నారని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్. సూపర్ హిట్ సభను చూసి జగన్‌కు మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండి పడ్డారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌ను మూసినదిలో వేయాలని మాట్లాడతారా.? అని ఆగ్ర హం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి పరిశ్రమలు తరలి వస్తుండడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. జగన్ హయాంలో రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేసి ఎంతో మంది నిరుద్యోగుల ప్రాణాలను బలితీసుకున్నారని మండిపడ్డారు. జగన్ లాంటి వారు రాజకీయాలకు పనికిరారని, ప్రజల సొమ్ము దోచుకుని హైదరాబాద్, బెంగళూరు, లండన్‌లో ప్యాలెస్‌లు కట్టుకున్నారని, ఎక్కడో ఒకచోట విశ్రాంతి తీసుకుంటే మంచిదని సూచించారు.

మణేకుర్తిలో కనకదాసు విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన కనకదాసు విగ్రహం

ఆలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మణేకుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన భక్త కనకదాసు విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి చెయ్యి విరిగొట్టారు. గురువారం ఉదయం గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ మహబూబ్‌బాషా, పోలీస్ సిబ్బంది విచారించారు. కురువ సంఘం నాయకులు గ్రామానికి చేరుకుని పరిశీలించారు. భారీ ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని విగ్రహం చెయ్యి విరగొట్టిన దుండగులను గుర్తించి అరెస్టు చేయాలని ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషాకు ఫిర్యాదు చేశారు. అనంతరం అంబేడ్కర్ కూడ లిలో రాస్తారోకో చేపట్టారు. కురువ సంఘం నాయకులు దేవేంద్ర, గిరి, మల్లికార్జున మాట్లాడుతూ పోలీసులు దర్యాప్తు చేసి, నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అయ్యాలప్ప, మహానంది, నాగేంద్ర, మంగన్న, రాజు, చంద్ర, ఉల్లెప్ప పాల్గొన్నారు. మణేకుర్తిలో భక్త కనకదాసు విగ్రహం ధ్వంసంపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు స్పందించారు. ఈ చర్యకు పాల్పడిన వారు ఎవరైనా సరే గుర్తించి అరెస్టు చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను ఆదేశించారు.

హెచ్.కొట్టాలలో ఆరు ఇళ్లలో దొంగతనాలు

- భయాందోళనలో ప్రజలు

బేతంచెర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఒకేసారి ఆరు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. దీంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. గ్రామ ప్రజలు, ఎస్ఐ రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయపాటి రవిశంకర్, ఎండూరి తిరు పాలు, ఉన్నం ధనుంజయ, ఎండూరి మోహన్‌రావు, చికెన్ బాషా, మంజు అరుణ ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బోయపాటి రవిశంకర్ తన కుమార్తె ఆరోగ్యం బాగాలేక పోవడంతో చికిత్స కోసం బెంగళూరు వెళ్లగా ఆయన ఇంటి తాళాలు పగులకొట్టి రెండు బీరువాలో ఉన్న నల్లపూసల దండ, 2 చైన్లు, నెక్లెస్, నాలుగు ఉంగరాలు, లక్ష్మీబిళ్ల, మూడు జతల బంగారు కమ్మలు, చెంపచేరాలతో కలిపి మొత్తం సుమారు 12 తులాల బంగారు, 10 తులాల వెండి, రూ.20 వేల నగదు చోరీ చేశారు. లారీ డ్రైవర్ ధనుంజయ డ్యూటీకి వెళ్లగా ఆయన ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలో ఉన్న రూ.72వేల నగదు, ఎండూరి తిరుపాలు ఇంట్లో 3 సెల్‌ఫోన్లు, చికెన్ బాషా ఇంట్లో రూ.1,200 నగదు, ఎండూరి మోహన్‌రావు ఇంట్లో తాళాలు పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఏమీ లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. అలాగే మంజు అరుణ తన తల్లి సాలమ్మ ఇంటికి వెళ్లి నిద్రిస్తుండగా.. ఇంటి తాళాలు పగులకొట్టి ట్రంకు పెట్టెలో ఉన్న 3తులాల బంగారు, 16 తులాల వెండి, రూ.లక్ష నగదు చోరీ చేశారు. ఎస్ఐ రమేష్ బాబు తన సిబ్బందితో చోరీ జరిగిన ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

లక్ష్యంపైనే దృష్టి సారించాలి

● ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత



సదస్సులో మాట్లాడుతున్న బాలలత

పాణ్యం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యంపైనే దృష్టి సారించాలని హైదరాబాద్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత పేర్కొన్నారు. గురువారం శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో బేసిక్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఐఎస్‌టీఈ స్టూడెంట్స్ చాప్టర్ ఏపీ 133 సహకారంతో 'హౌటు చూజ్ ద రైట్ పాత్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బాలలత మాట్లాడుతూ చిన్న కలలతో ఆగిపోకండి, పెద్ద కలలను కనాలని సూచించారు. టెస్లా వ్యవస్థాపకుడు మస్క్ వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఒకే పనిపై ఇరవై నిమిషాలు దృష్టిని కేంద్రీకరించి చిన్న విరామం తర్వాత మళ్లీ అదే ఉత్సాహంతో కొనసాగితే విజయం తప్పదని స్పష్టం చేశారు. స్వీయ ప్రేరణ నిలకడగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఓడి శేషయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

దసరా శరన్నవరాత్రి ఏర్పాట్లకు సీల్ టెండర్లు


సీల్ టెండర్లను పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఈనెల 22 నుంచి 10 రోజుల పాటు జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్స వాల ఏర్పాట్ల కోసం సీల్ టెండర్ల ద్వారా కాంట్రాక్ట్ పనులను అప్పగించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు పూల అలంకరణతో పాటు విద్యుత్ అలంకరణ పనులకు సీల్ టెండర్లు నిర్వహించారు. పూల అలంకరణకు చిత్తూరు జిల్లా అంబూరుకు చెందిన జగన్ రూ.8 లక్షల 30 వేలకు దక్కించుకు న్నారు. అలాగే విద్యుత్ అలంకరణ ఏర్పాట్లను నంద్యాల మణికంఠ ఏజెన్సీ రూ.2లక్షల 50 వేలకు దక్కించుకున్నట్లు ఈవో వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మధు, పర్యవేక్షకుడు నీలకంఠరాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


నందమూరినగర్ ప్రజలతో ప్రసాద్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతమైన నందమూరినగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం అక్కడి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలు లేక వాన నీరు ఇళ్లలోకి చేరుతోందన్నారు. వ్యాధులు ప్రబలక ముందే ప్రజా ప్రతినిధులు, నాయకులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు హుసేన్‌సా, ఓబులేసు, జాన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణును కలిసిన సింగిల్ విండో చైర్మన్లు


చైర్మన్‌ను సత్కరిస్తున్న సింగిల్ విండో చైర్మన్లు

ఆత్మకూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని, సీఈవో రామాంజనేయులును గురువారం శ్రీశైలం నియోజకవర్గంలోని ఆయా సింగిల్ విండో చైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. వారి కార్యాలయాల్లో వారిని కలిసి గజమాలతో సత్కరించారు. ప్రత్యేకించి ఆత్మకూరు, పరమటూరు, వెలుగోడు, రేగడగూడూరు, గోపవరం, తిమ్మాపురం, ఏకోదూరుల సొసైటీ చైర్మన్లు షహబుద్దిన్, సాయిబాబారెడ్డి, శంకరరెడ్డి, మొల్ల బహీర్, ఉమామహేశ్వరరెడ్డి, వెంకటరంగయ్య, సుబ్బారెడ్డిలతో పాటు ఆయా సొసైటీల డైరెక్టర్లు ఆయన్ని కలిసి పరిచయం చేసుకున్నారు. తమ సొసైటీల అభివృద్ధికి సహకరించి అన్నదాతల సంక్షేమానికి తోడ్పాటునందించాలని ఆకాంక్షించారు.

భారీ వర్షం.. రైతుల్లో హర్షం

కొత్తపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో అత్యధికంగా సాగు చేసిన కంది, మినుము, మొక్కజొన్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొత్తపల్లిలోని తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలోకి వర్షం నీరు చేరి శివలింగాన్ని సైతం ముంచెత్తడంతో స్వామివారికి కష్టాలు తప్పడం లేదు. ఇదిలా ఉంటే నందికుంట గ్రామ శివారులో నల్లమల అటవి ప్రాంతం నుంచి వర్షం నీరు భారీగా వచ్చి చేరతుండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అంతేగాకుండా పంట పొలాల్లో వర్షం నీరు అధికంగా చేరడంతో రైతులు బయటకు ఆ నీటిని బయటకు వదిలేశారు. అంతేగాకుండా గువ్వలకుంట్లలో ఓ భారీ వృక్షం వర్షానికి, ఈదురుగాలులకు నేలకురవడంతో విద్యుత్ స్థంభం విరిగి పడింది. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. గువ్వలకుంట్ల భైరాపురం చెరువుకు వర్షం నీరు అధికంగా రావడంతో అలుగు పారుతోంది. గత వారం రోజులుగా ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడి పోయిన ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించిందని చెప్పవచ్చు.


కుంటను తలపిస్తున్న నందికుంట గ్రామ రోడ్డు



వరద నీటిలో ఇబ్బంది పడుతున్న వాహనదారుడు.. గువ్వలకుంట్లలో భైరాపురం చెరువు అలుగు పారుతున్న దృశ్యం

టీడీపీతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి : మంత్రి ఫరూక్

● రూ 1.40 కోట్లతో నిర్మించిన రోడ్డు ప్రారంభం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సమగ్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం పట్టణంలో పద్మావతినగర్‌లో రూ.1.40 కోట్లతో ఏర్పాటు చేసిన రెండు వరుసల సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి చంద్రబాబునాయుడితోనే సాధ్య మన్నారు. నంద్యాల పట్టణ అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేశారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రూ.1.40 కోట్లతో పద్మావతినగర్‌లో రోడ్డు నిర్మించారన్నారు. గతంలో చిన్న చిన్న వర్షాలకే మురుగు నీరు రోడ్డుపైకి చేరి ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంతో సమస్య శాశ్వతంగా పరిష్కారమైందన్నారు. అలాగే రూ.40 లక్షలతో డివైడర్, సుందరీకరణ పనులు చేపడతామ న్నారు. అలాగే సంజీవనగర్ నుంచి ఆత్మకూర్ బస్టాండ్ వరకు త్వర లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించ నున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సమ్మర్ స్టోరేజి- 2 నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పట్టణాన్ని అన్నివిధాలు గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఆర్డీవో చల్లా విశ్వనాథ్, కౌన్సిలర్లు జైనాబీ, శ్రీదేవి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్ అహ్మద్, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నరహరి విశ్వనాథ రెడ్డి, వార్డు ఇన్‌చార్జి మధుసాయి తదితరులు పాల్గొన్నారు. .


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్


రూ 1.40 కోట్లతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు ఇదే..

14న జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

పాణ్యం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక ఈనెల 14న జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నంద్యాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించే ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి 1 వతేదీ తర్వాత జన్మించి ఉండాలన్నారు. బాలురు 75 కిలోలు, బాలికలు 65 కిలోల బరువు ఉండాలన్నారు. బర్త్ సర్టిఫికెట్, పదవ తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు పోటీ ఎంపికలో పాల్గొనాలని తెలిపారు.

ఎంపికైన వారికి ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో ఈనెల 22 నుంచి 25 వరకు జరిగే 51వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి రాహుల్ అంబేద్కర్

నందికొట్కూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ ఈనెల 13న నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలని నందికొట్కూరు సివిల్ న్యాయాధికారి శోభారాణి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో ఈనెల 13న జరిగే పోలీసు అధికా రులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులకు అవగాహన కల్పించి లోక్ అదాలత్ ద్వారా అప్పీల్‌లేని తీర్పును పొందవచ్చన్నారు. ముఖ్యంగా న్యాయవాదులు, పోలీసు అధికారుల సహకారం లేనిదే ఈ కార్యక్రమం విజయవంతం కాదని, అందుకే అందరి సహకారం అందిం చాలని కోరారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి రాహుల్ అంబేద్కర్ మాట్లాడుతూ రాజీకి అర్హమైన సివిల్, క్రిమినల్ తగాదాలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శరభయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న ఈవో శ్రీనివాసరావు

మొక్కలు నాటిన ఈవో

శ్రీశైలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, క్షేత్ర సుందరీకరణలో భాగంగా శ్రీశైల క్షేత్ర పరిధిలో పలు చోట్ల మొక్కలు నాటుతున్నట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించేందుకు 30 శాతం దేవతా మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు.పుష్పవనంలో బిల్వం మొక్కలను నాటినట్లు పేర్కొన్నారు. మొక్కల పెంపకానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉద్యానవన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఎస్.లోకేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలెంచెరువు రోడ్డుకు మోక్షమెన్నడో?

కొత్తపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల- పాలెంచెరువు రోడ్డుకు మోక్షమెన్నడో అని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నించారు. సంబంధిత ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మొరపెట్టుకుంటున్నారు. పదిహేనేళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు ప్రస్తుతం గుంతలమయం కావడంతో ద్విచక్రవాహనదారులతో పాటు ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.నల్లమల అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న పాలెంచెరువు గూడెంలో 1 నుంచి 10వ తరగతి వరకు గిరిజన ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేశారు. కానీ రోడ్డుపై భారీ స్థాయిలో గుంతలు ఏర్పడటంతో ఈ పాఠశాలకు వెళ్లే ఉపాధ్యాయులు, గ్రామస్థులు విద్యార్థుల కోసం వెళ్లే వారి తల్లిదండ్రులు ఇబ్బందిపడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రోడ్డుకు మహర్దశ వస్తుందో లేదో వేచి చూడాల్సిందే..


గుంతలమయమైన గువ్వలకుంట్ల-పాలెంచెరువు రోడ్డు

నారా లోకేశ్ కృషితో స్వస్థలాలకు తెలుగు ప్రజలు

● ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నేపాల్ అల్లర్లలో చిక్కుకున్న తెలుగు వారిని మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని స్వస్థలాలకు రప్పించడం అభినందనీయమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురు వారం ఆయన మాట్లాడుతూ.. నేపాల్ దేశంలో చోటు చేసుకున్న ఆందోళనల్లో తెలుగు రాష్ట్రాల ప్రజలు చిక్కుకున్నారన్న విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని ఆగమేఘాల మీద అమరావతికి చేరుకుని నేపాల్‌లో తెలుగు ప్రజల పరిస్థితి గురించి తెలుసుకుని అందరినీ రాష్ట్రానికి తీసుకురావడం అభినందనీయమన్నారు. అక్కడ చిక్కుకున్న బాధితులతో మా ట్లాడి వారికి ధైర్యం ఇస్తూ.. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి వారికి అక్కడే ఆహారం, వసతి, నీరు, ఇతర సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. మంత్రి లోకేశ్ చేసిన కృషిని గమనిస్తే ప్రజల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న బాధ్యతేమిటో అర్థం చేసుకోవచ్చునన్నారు. కాగా నేపాల్‌లో తెలుగు ప్రజలు చిక్కుకుంటే కనీసం మాజీ సీఎం జగన్ స్పందించకపోవడం దారుణమన్నారు. ఉత్తరాఖండ్ వరదల్లో, గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారిని కాపాడి స్వదేశానికి తీసుకురావడంలో కూడా సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషించినట్లు ఆయన గుర్తు చేశారు.

మంత్రి లోకేశ్ చొరవ ప్రశంసనీయం

● ఎమ్మెల్యే జయసూర్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : నేపాల్ అల్లర్లలో చిక్కుకున్న తెలుగు వారిని స్వస్థలాలకు రప్పించడంలో మంత్రి నారా లోకేశ్ చొరవ ప్రశంసనీయమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గురువారం నందికొట్కూరు మండలంలోని అల్లూరులో ఆయన విలేక రులతో మాట్లాడుతూ నేపాల్ దేశంలో జరుగుతున్న మారణ హోమంలో తెలుగువారు చిక్కుకున్నారని తెలియగానే లోకేశ్ ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా స్పందించారన్నారు. అనంతపురం పర్యటనను సైతం రద్దు చేసుకుని ఉదయాన్నే హుటాహుటిన సచివాలయానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారన్నారు. రియల్‌టైం గవర్నెన్స్ సెంటర్, వార్ రూమ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌గా మార్చి సహాయక చర్యలను వేగవంతం చేశారన్నారు. బాధితులతో మాట్లాడి వారికి కొండంత ధైర్యం చెప్పారన్నారు. నేపాల్‌లో తెలుగు వారు ఎక్కడెక్కడ ఉన్నారో లోకేషన్ కో ఆర్డినేటర్లతో సహా మ్యాప్ సిద్ధం చేయించారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడం అలాగే చిక్కుకు పోయిన తెలుగు ప్రజలకు ఆహారం, నీరు, వసతి సదుపాయాలు కల్పించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారని వివరించారు. కేంద్రం అండ, అధికారుల సమన్వయంతో ఆపదలో ఉన్న ఒక్కొక్కరినీ సురక్షిత ప్రాంతాలకు తీసుకుని వచ్చేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు కదిలారన్నారు.నేపాల్ అల్లర్లలో చిక్కుకున్న సుమారు 215 మంది తెలుగు ప్రజలను సురక్షితంగా తిరిగి తీసుకు వచ్చేందుకు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు.

భక్తిశ్రద్ధలతో పారాయణం



శ్రీశైలం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా కర్నూలు శ్రీమాతా సత్సంగ్ బృందం వారిచే గురువారం శివానందలహరి, సౌందర్యలహరి పారాయణ కార్యక్ర మాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద సాయంకాలం ఈ కార్యక్రమం జరిగింది. అలాగే బొల్లవరం గ్రామానికి చెందిన ఎస్. రామన్నగౌడ్ నిర్వహించిన భజన కార్యక్రమం అలరించింది.

దత్తాత్రేయ స్వామికి పూజలు

శ్రీశైలం,సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం దేవస్థానంలో గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద నెలకొన్న శ్రీదత్తాత్రేయ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజను నిర్వహించి అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు


మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మారుతీనగర్ కాలనీవాసులు

నందికొట్కూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మారుతీనగర్ కొట్టాల్లో రోడ్లు, నీళ్లు, కరెంటు సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు హెచ్చరించారు. గురువారం నందికొట్కూరు మున్సిపాల్టీ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతీనగర్ కాలనీ ఏర్పడి 30 ఏళ్లు అవుతున్నా నీళ్లు, రోడ్లు, కరెంటు లాంటి ప్రజల అత్యవసర సమస్యలు పరిష్కరించకపోవడం విచారకరమన్నారు. కాలనీలో రోడ్లు లేకపోవడం వల్ల వర్షాకాలంలో వృద్ధులు, పిల్లలు రాకపోకలకు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. గర్భిణులు అత్యవసర సర్వీసులకు హాస్పిటల్ అంబులెన్స్ కాలనీలోకి రావడానికి లేదని తెలిపారు. కొన్నిచోట్ల రోడ్లు ఉన్నా కల్వర్టులు లేకపోవడం వల్ల టూవీలర్ వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడి కింద పడుతున్నారన్నారు. లో వోల్టేజ్ వల్ల ఇళ్లలో ఉన్న టీవీలు, ఫ్రిజ్‌లు, లైట్లు కాలిపోతున్నాయని, ఈ సమస్య పరిష్కారానికి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

అటవీశాఖలో విధులు సాహసోపేతమైనవి



నివాళి అర్పిస్తున్న అధికారులు

రుద్రవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో విధులు నిత్యం సాహసోపేతంగా ఉంటాయని రేంజర్ ముర్తుజావలి అన్నారు. బుధవారం రుద్రవరం ఫారెస్టు కార్యాలయంలోజాతీయ అటవీ శాఖ అమరవీరుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజర్ ముర్తుజావలి మాట్లాడుతూ ఒక వైపు స్మగ్లర్ల దాడులు, మరో వైపు వన్య ప్రాణులుతో పోరాటంచేస్తూ విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అటవీ, వన్యప్రాణుల నిర్వహణలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు మక్తర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రాణెమ్మ, మహబూబ్‌ఖాన్, రామక్రిష్ణ, బీట్ ఆఫీసర్లు సురేంద్రగౌడ్, నాగ హుసేనయ్య, జేమ్స్‌పాల్, నరసింహారెడ్డి, మదనగోపాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



తెలుగు పండిట్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

చాగలమర్రి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బాలికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుగ్రహీత లక్ష్మయ్యను గురువారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో ఆ సంఘ అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ ఆధ్వర్యంలో శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, సిద్ధప్ప, లాలయ్య, పుల్లయ్య, చిన్నికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే రేషన్ ఇవ్వకుంటే చర్యలు

చాగలమర్రి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా గ్రామాల్లోగల 65 ఏళ్లపైబడిన వృద్ధులకు ఇంటివద్దకు వెళ్లి రేషన్ సరుకులు ఇవ్వకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 65 ఏళ్లపైబడిన వృద్ధులు 1727 మంది ఉన్నారని అన్నారు. వీరికి ప్రతి నెల 25 నుంచి 30వ తేదీ లోపు రేషన్ సరుకులు ఇళ్ల వద్దకు ఇవ్వాలని అన్నారు.

రూ.70 లక్షలతో సీసీ రోడ్ల పనులు

రుద్రవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలంలో ఉపాధి హామీ పథకం కింద రూ.70లక్షలతో సీసీ రోడ్ల పనులు చేపట్టినట్లు పీఆర్ ఏఈ కమాల్‌సాహెబ్ గురువారం తెలిపారు. యల్లావత్తుల్లో రూ.25లక్షలు, డి.కొట్టాలు రూ.25లక్షలు, పెద్దకంబలూరులో రూ.10లక్షలు, కొండమాయపల్లె, ఆర్.కొత్తూరు గ్రామాల్లో రూ.10లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టినట్లు పీఆర్ ఏఈ తెలిపారు.

ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలి

రుద్రవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. గ్రామాల్లోని ఓఎస్ఆర్ ట్యాంకులు, మినీ ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. పైపులైన్లకు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మత్తులు చేయించాలని సూచించారు.

వ్యక్తిపై దాడి.. ముగ్గురిపై కేసు

రుద్రవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచినేనిపల్లె గ్రామంలో దాడి ఘటనలో గురువారం ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన రాజు, నాగేశ్వర్‌రావు, చెన్నకేశవులు ఘర్షణకు పాల్పడ్డారని బాధితుడు ఓబులపతి పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహ్మద్ రఫి తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చాగలమర్రి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 16న నంద్యాల జిల్లాస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, కార్యదర్శి సంజీవరాయుడు గురువారం తెలిపారు. జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో పాల్గొనే క్రీడాకారుల ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయిహ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని అన్నారు.

కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు పునరుద్ధరణపై హర్షం



మిఠాయిలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు పునరుద్ధరణపై సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి భార్గవ్, అజాంబేగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం వారు మిఠాయిలు పంచిపెట్టారు. రైల్వేస్టేషన్ మాస్టర్, రైల్వే లోకో పైలట్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కరోనా సమయం నుంచి ఎక్స్‌ప్రెస్ రైలు బేతంచెర్ల రైల్వేస్టేషన్‌లలో నిలపలేదని, ఈ విషయమై నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి చొరవతో తిరిగి నిలుపుతున్నారన్నారు. ఈ మేరకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు తిరుమలేష్, దస్తగిరి, పి.నాగరాజు, కృష్ణారెడ్డి, మల్లేశ్వరుడు, ఉదయ్, మధు, ప్రదీప్, రామతిమ్మయ్య, శ్రీకర్, మధు, బాలు, రవి, గోపి, టైలర్ బాలు, మధు, సతీష్, పరమేష్, విజయ్, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

చాగలమర్రి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట వివరాలను నమోదు చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ సూచించారు. పెద్దబోదనంలో ఏఈవోలు రేవతి, రాఘవకుమారి, వీఏఏ కల్యాణ్‌నాయక్‌లు మొక్కజొన్న పంట వద్ద రైతులకు ఈ-క్రాప్ నమోదు చేశారు. ఈనెల 30వ తేదీలోపు పంట నమోదు చేయించుకోవాలన్నారు.

తీరిన రోడ్డు సమస్య



కొలిమిగుండ్లలో కుంటను తలపిస్తున్న ఎన్‌హెచ్-544డి ప్రధాన రహదారి (ఫైల్)



రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నా నీరు నిలవని దృశ్యం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రహదారుల విషయంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి, మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి చొరవతో గుంతలులేని రహదారుల నిర్మాణంలో ప్రభుత్వం సఫలీకృతమైందని చెప్పవచ్చు. ఎన్‌హెచ్-544డి ప్రధాన రహదారి కొలిమిగుండ్ల మండలకేంద్రంలో స్టేట్ బ్యాంకు, వైసీపీ కార్యాలయం ఎదురుగా వర్షం కురిస్తే చాలు కుంటను తలిపించేది. దీంతో వాహనాలు, పట్టణ ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. చాల కాలంగా నెకొని ఉన్న ఈసమస్య చిన్నపాటి వర్షం కురిసిన ఏపీజీబీ, ఎస్బీఐ వద్ద నుంచి పోలీస్ స్టేషన్ సమీపం వరకు నీరు నిలిచేది. దీంతో గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయిన పరిస్థితులు అనేకం ఉన్నాయి. జాతీయ రహదారి కావడంతో విజయవాడ, బెంగళూరు వంటి దూర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయితే మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని గత రెండు నెలల క్రితం రహదారిని ఎత్తు పెంచి, నిర్మాణం చేట్టారు. దీంతో గురువారం భారీ వర్షాలు కురిసినా రహదారిలో చుక్క నీరు నిలవకపోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న దీర్ఘకాలిక సమస్యకు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పరిష్కారం చూపడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

- 10.45కు ప్రారంభం కావాల్సిఉండగా 12.15కు..
- ఈ ఒక్కసారికి రండి అంటూ ఎంపీటీసీలను అభ్యర్థించిన అధికారులు



మాట్లాడుతున్న పీఆర్ ఏఈ కమాల్‌సాహెబ్

రుద్రవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 12:15 గంటలకు ప్రారంభమై 55 నిమిషాల్లో ముగిసింది. ఈ ఒక్కసారి సర్వసభ్య సమావేశానికి రావాలంటూ ఎంపీటీసీలను అధికారులు అభ్యర్థించారు. ఏకంగా కొందరు ఎంపీటీసీల కోసం కార్లే పంపించారు. ఎంపీటీసీలకు ఏడాదిన్నరగా గౌరవవేతనాలు అందడంలేదని దూరంగా ఉన్నట్లు చర్చనీయాంశంగా మారింది. సమస్యలపై చర్చించాల్సిన సభ్యులు, అధికారులు 55 నిమిషాల్లో సమావేశాన్ని ముగించేసి మమ అనిపించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఏఈలు కమాల్‌సాబ్, సుబ్రహ్మణ్యం, రఘురాముడు, రాజశేఖర్, పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, ఏపీవో గౌరీబాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేగం, ఎంఈవో లక్ష్మీదేవి, ఏఈవో రాజు, బీట్ ఆఫీసరు సురేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద ఆశయాలు స్ఫూర్తిదాయకం

చాగలమర్రి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద ఆశయాలు యువతకు స్ఫూర్తినిస్తాయని రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి అనుపమానందజీ తెలిపారు. గురువారం చాగలమర్రి వాసవీ ఎయిడేడ్ జూనియర్ కళాశాలలో రామకృష్ణమిషన్ ఆధ్వర్యంలో యూనివర్శల్ బ్రదర్‌హుడ్‌డేను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నైతిక విలువలతో జీవనం సాగించాలని అన్నారు. నేటి యువతరం స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో యోగి వేమన వర్సిటీ ప్రొఫెసర్ రామసుబ్బారెడ్డి, విశ్రాంత హిందీ అధ్యాపకులు శివరామిరెడ్డి, కరస్పాండెంట్‌లు రమణగుప్త, రఘురామ్, కార్యదర్శి పుల్లారెడ్డి, రామశేషయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 10న అనంతపురం జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభకు మహిళలు ప్రజలు అశేషంగా తరలివచ్చి సభ విజయవంతం చేశారన్నారు. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆటో డ్రైవర్ల కష్టాలను దృష్టిలో ఉంచుకొని వారికి రూ.15 వేలు చొప్పున దసరాకు అందించేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉండడం హర్షణీయమన్నారు.

మధ్యాహ్న భోజనం ఇలానే పెట్టాలి

- ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంగిమల్ల దేవి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం బాగా ఉందని, రోజూ ఇలానే పెట్టాలని ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంగిమల్ల దేవి అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలోని గదులను పరిశీలించారు. కమిషనర్ భోజనాన్ని స్వయంగా తిని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈమె వెంట ఏడీ చౌడేశ్వరిదేవి, సీడీపీవోలు విజయలక్ష్మి, ఉమాదేవి, మధ్యాహ్న భోజనం కోఆర్డినేటరు అజ్మతుల్లా, డీసీడీవో నాగ సువర్చల ఉన్నారు.

ఆళ్లగడ్డ: పాఠశాలల్లో దుకాణాలు ఉంచి బయటి వస్తువులను విద్యార్థులకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి హెచ్చరించారు. పట్టణంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్, నిత్యావసరాల నాణ్యతను పరిశీలించారు.

పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు ఇస్తున్న ఆహార పదార్థాలు, విద్యాబోధన పై విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. ఆమె వెంట జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ చింతామణి, ఏటీడబ్ల్యూవో ఉసేనయ్య, డీసీవో శ్రీదేవి, జగ్గయ్య ప్రిన్సిపాల్ గుర్రప్ప, ఎంఈవో శోభా వివేకవతి తదితరులు పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబా పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్లలో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం రాత్రి పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు లక్ష్మయ్యస్వామి ఆధ్వర్యంలో స్వామి వారి చిత్రపటాన్ని ప్రత్యేక పల్లకీలో ఉంచి, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మాడవీధుల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని గుంజలపాడు రహదారిలో ఉన్న షిరిడీ సాయిబాబా దేవాలయంలో సాయిబాబాకు ప్రజలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానకి చేరుకుని సాయిబాబాకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఇక్కడికి వచ్చిన భక్తులకు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

నేడు మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభం

డోన్ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి శుక్రవారం ఉదయం 10 గంటలకు మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించను న్నారు. పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ఈ నెల 10వ తేదీన జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చొరవతో అగ్రిసోల్ కంపెనీ సహకారంతో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటుకు ముందుకచ్చారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు పాల్గొని జయప్రదం చేయలని కోరారు.

రూ.2.2 కోట్లతో గదుల నిర్మాణం



స్థలాన్ని పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసులు

శిరివెళ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శిరివెళ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రయోజనార్థం రూ.2.2 కోట్లతో గదుల నిర్మాణం చేపట్టనున్నట్లు సమగ్రశిక్ష అభియాన్ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. గదులు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఆయన గురువారం పరిశీలించారు. విద్యార్థుల కోసం ఆరు డార్మెంటరీలు, మూడు ల్యాబ్‌లు నిర్మిస్తామన్నారు. ఆయన వెంట కేజీబీవీ ఎస్‌వో జ్యోతి, మాజీ జడ్పీటీసీ గుర్రప్ప ఉన్నారు.

బస్టాండులో సీసీ రోడ్డుకు మోక్షం



బస్టాండులో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో బస్టాండు నుంచి బయటికి వెళ్లే సీసీ రోడ్డు శిధిలావస్థకు చేరుకుని మోకాలిలోతు గుంతలు ఏర్పడడంతో చిన్నపాటి వర్షం వస్తే నీరు నిల్వ చేరుతుండేది. దీంతో ప్రయాణికులు, ఆర్టీసీ బస్సులు బస్టాండులో నుండి బయిటికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్టీసీ నిధులు రూ.10లక్షలు మంజూరు చేయించారు. దీంతో నూతనంగా సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.

భారీ వర్షం

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం తెల్లవారు జాము నుంచి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ఉయ్యాలవాడలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణం చుట్టూ వర్షపు నీరు చేరి విద్యార్థులు రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే అల్లూరు - మాయలూరు గ్రామాల మధ్య భారీ చింత చెట్టు రోడ్డుకు అడ్డంగా విరిగి పడటంతో వాహనాల రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. రెండు గంటల పాటు కోవెలకుంట్ల - జమ్మలమడుగు పట్టణాలకు రాక పోకలు నిలిచి పోయాయి.

రుద్రవరం: రుద్రవరం మండలంలో కురిసిన వర్షానికి మొక్కజొన్న పంట నేలవాలింది. మందలూరు, చందలూరు, రుద్రవరం తదితర గ్రామాల్లో పంట నేలవాలిందని రైతులు వాపోయారు. మిరప, పసుపు పంట వరి పంట పొలాల్లో కూడా వర్షం నీరు వచ్చి చేరింది.

డోన్ రూరల్: డోన్ మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10.30 గంటల వరకు వర్షం కురిసింది. ఉదయం వర్షంలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బం దులు పడాల్సి వచ్చింది. రోడ్లు బురదమయమయ్యాయి. దీంతో పాద చారులు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ వర్షంతో రొచ్చురొచ్చుగా మారాయి.

బనగానపల్లె: మండలంలో గురువారం తెల్లవారుజామున నుంచి భారీ వర్షం కురిసింది. 30.0 ఎంఎం వర్షపాతం నమోదయింది. ఈవర్షం మొక్కజొన్న పంటకు ఊపిరి పోసింది. అలాగే ప్రస్తుతం పదును వర్షం కురవడంతో జొన్న, కంది, కొర్ర ఇతర పంటలు సాగు చేసేందుకు అన్నదాతలు సమాయాత్తమవుతున్నారు. ఈవర్షం వల్ల బనగానపల్లె పట్టణంలో పలు కార్యాలయాల వద్ద వర్షపునీరు నిలిచిపోయాయి. పట్టణంలోని తహసీల్దారు, ఎంపీడీవో , ఉన్నతపాఠశాల మైదానంలో నీళ్లు నిలిచిపోయాయి. కొలిమిగుండ్ల మండలంలో 128.4 ఎం.ఎం. వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా కొలిమిగుండ్ల మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. అవుకు మండలంలో 67.2 ఎంఎం వర్షపాతం, కోవెలకుంట్ల 50.0ఎంఎం, సంజామల మండలంలో 30.0 ఎంఎం నమోదైంది.

కోవెలకుంట్ల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం తెల్లవారు జామున నుంచి పెద్ద ఎత్తున వర్షం కురిసింది. వల్లంపాడు, చిన్నకొప్పెర్ల మధ్యన ఉన్న నల్లవంక వాగు, చిన్నకొప్పెర్ల -పెద్దకొప్పెర్ల మధ్యన ఉన్న ఎర్రవాగు ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



అల్లూరు - గుళ్లదుర్తి గ్రామాల మధ్య రోడ్డుపై విరిగి పడ్డ భారీ వృక్షం





మందలూరులో నేలవాలిన మొక్కజొన్న పంట, బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు

బకాయిలు చెల్లించాలి: ఏపీటీఎఫ్

బనగానపల్లె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నపాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఆవరణంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హరినాథ్‌గౌడ్, కౌన్సిలర్లు ఓబయ్య, హెచ్‌ఎం సింగయ్య, దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపు ప్రారంభం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆక్యుపెంక్చర్, మ్యాగ్నటిక్ థెరపీ, 20 రకాల జబ్బులకు ఎక్సర్‌సైజ్‌కు సంబంధించి ఐదు రోజుల క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు పెండేకంటి నాగరాజు, గౌరవ సలహాధ్యక్షుడు కాల్వ శివనాగయ్య, కమిటీ మెంబర్లు కాల్వ శివ, అడ్డగాళ్లనందయ్య, వాసు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 84 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మొత్తం 7 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 2వేల మంది రైతులకు యూరియాను అందజేసినట్లు తెలిపారు. ఏఈవో నాగరాజు పాల్గొన్నారు.

సర్పంచ్ శ్రమదానం

- ఊరబావిని శుభ్రం చేసిన ప్రజలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్లలోని రెడ్డి వెంగన్న(ఊర) బావిని సర్పంచ్ జినుగు శివరాముడు ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించి శుభ్రం చేశారు. సర్పంచ్‌తో పాటు గ్రామానికి చెందిన యువకులు, పంచాయతీ సిబ్బంది సహకారంతో చెత్తతో నిండి ఉన్న బావిని శుభ్ర పరిచారు. దీంతో చెత్తాచెదారంతో నిండిన బావి కళకళలాడుతోంది. పెద్ద ఎత్తున చెత్త నిండి, కంపు కొడుతున్న బావిని, రెండు రోజుల పాటు శ్రమించి, శుభ్రం చేశారు. దీంతో సరదాగా యువకులు బావిలో ఈదుతో సందడి చేశారు. బావిని బాగుచేసిన గ్రామ సర్పంచ్‌ను ప్రజలు అభినందిస్తున్నారు.

పేదలకు అండగా బీసీజేఆర్ ట్రస్టు: మంత్రి



ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీజేఆర్ ట్రస్టు పేదలకు అండగా ఉంటుందని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. క్రిష్టిపాడు గ్రామానికి చెందిన వీరేంద్ర కోవెలకుంట్లలో నివాసం ఉంటూ టైలర్‌గా జీవనం సాగించేవారు. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో గురువారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి రూ.50వేల నగదును వీరేంద్ర భార్య నాగమణికి నగదును అందించారు. బీసీజేఆర్ ట్రస్టు చైర్‌పర్సన్ బీసీ ఇందిరమ్మ తరపున మంత్రి ఈమొత్తాని అందించి ఆకుటుంబాన్ని ఆదుకున్నారు.

రైతు సేవా కేంద్రాల తనిఖీ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవనూరు, కలుగొట్ల, వెలగటూరు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను గురువారం తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. రైతు సేవాకేంద్రాల్లో జరుగుతున్న యూరియా పంపిణీని ఆయన పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సక్రమం గా పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పంపిణీలో ఎలాంటి గొడవ జరగకుండా పోలీసు, రెవెన్యూ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జ్వర బాధితుల గుర్తింపునకు సర్వే

చాగలమర్రి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో జ్వర బాధితులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేస్తున్నట్లు సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. గురువారం కస్తూర్బా పాఠశాల సమీపంలోగల పక్కా గృహాలలో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులకు రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మనోహర్, ఏఎన్‌ఎం లక్ష్మీ, ఆశా వర్కర్లు శివలక్ష్మి, సౌభాగ్య ఉన్నారు.